నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, సోమవారం 20 మే 2024 | KAMAREDDY

టీఎస్‌కు బదులు టీజీ

సంక్షిప్త పదాన్ని మార్చాలని ఉత్తర్వులు

కంఠేశ్వర్/ కామారెడ్డి, మే 19: తెలంగాణ సంక్షిప్త పదాన్ని టీఎస్‌కు బదులు టీజీగా మార్చాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, జితేశ్ వీ పాటిల్ ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు, నోటిఫికేషన్లు, నివేదికలు, లెటర్‌హెడ్‌లలో తెలంగాణ సంక్షిప్త పదం టీజీగా పేర్కొనాలని సూచించినట్లు తెలిపారు. ఈ మేరకు కేంద్రం అనుమతిస్తూ గెజిట్ జారీ చేసిందని, గత మార్చి నెలలోనే వాహనాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన అనుమతులు రాగా తాజాగా అన్ని ప్రభుత్వ వ్యవహారాల్లో టీఎస్‌కు బదులు టీజీగా వ్యవహరించేందుకు అనుమతించిందని పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలు, సంస్థలు,స్వయం ప్రతిపత్తి కలిగిన విభాగాలన్నీ దీనిని విధిగా పాటించాలని ఆదేశించారు. లెటర్‌హెడ్‌లు, రిపోర్టులు, నోటిఫికేషన్లు, అధికారిక వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్స్, పాలసీ పేపర్లు, అధికారిక ఉత్తర ప్రత్యుత్తరములన్నింటిపై టీఎస్ స్థానంలో టీజీగా మార్చాలని సూచించారు. అన్ని అధికారిక వ్యవహారాలకు వర్తింపజేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, తక్షణమే అమలులోకి వస్తాయని తెలిపారు. అన్ని శాఖల ప్రభుత్వ కార్యాలయాల్లో టీఎస్‌కు బదులు టీజీగా మారుస్తూ ఈ నెల 26వతేదీలోగా నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

ఇట్లైతే ఎట్ల బతకాలి..

కొనుగోలు కేంద్రానికి వడ్లు తీసుకొచ్చి 20 రోజులవుతున్నది. లారీలు రాకపోవడంతోనే కాంటా వేయడం లేదని సొసైటీ సిబ్బంది చెబుతున్నా రు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి. వర్షం ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. వడ్లు తడిసి మొలకెత్తుతున్నాయి. ఇట్ల అయితే రైతులు ఎలా బతకాలి.

- పి.రాములు, రైతు, బీబీపేట్

20 రోజులవుతున్నా కాంటా పెడ్తలేరు..

నేను మూడెకరాల్లో వరి సాగు చేసిన. కోత కోసి గత నెల 30వ తేదీన వడ్లను కేంద్రానికి తీసుకొచ్చిన. ఇప్పటి వరకు కాంటా పెట్టలేరు. అకాల వర్షాలతో వడ్లన్నీ తడిసి మొలకెత్తుతున్నాయి. గతంలో ఉన్న ప్రభుత్వం వడ్లను తొందరగా కొన్నది. ఇప్పటి సర్కారు కొనుగోళ్లను పట్టించుకుంట లేదు. అధికారులు, ప్రభుత్వం స్పందించి వెంటనే ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం చేయాలి.

- పాత పెంటయ్య, రైతు, జనగామ

మంచి దిగుబడి వచ్చిందన్న

ఆశతో కొనుగోలు కేంద్రాలకు పంటతో వచ్చిన రైతుల ఆశలు అడియాశలవుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన వడ్లను తీసుకొచ్చి ఇరవై రోజులవుతున్నా కాంటా చేయకపోవడంతో అకాల వర్షానికి తడిసి మొలకలు వస్తున్నాయి. కొనుగోళ్లలో ఆలస్యం.. తడిసిన ధాన్యానికి మొలకలు వస్తుండడంతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి, బీబీపేట, కామారెడ్డి రూరల్ తదితర మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. ఒక్కో సొసైటీలో వందలాది వడ్ల కుప్పలు అలాగే ఉన్నాయి. లారీల లోడింగ్, అన్‌లోడింగ్ సమస్యను పరిష్కరించే నాథుడు లేకపోవడంతో రోజుల తరబడి కొనుగోలు కేంద్రాలను దాటడం లేదు. ధాన్యం తీసుకొచ్చి దాదాపు 20 రోజులవుతున్నా కాంటా చేయకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మళ్లీ వర్షం వస్తే తమ పరిస్థితి ఏమిటో తెలియక రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికే ధాన్యం కుప్పలతోపాటు బస్తాలకు కూడా మొలకలు రావడంతో వాటిని ఆరబెట్టేందుకు ఆపసోపాలు పడుతున్నారు.

– బీబీపేట, మే 19

- సెంటర్ల నుంచి తరలని బస్తాలు
- అకాల వర్షంతో తడిసిన ధాన్యం
- దిక్కుతోచని స్థితిలో రైతులు
- వర్షాల ముప్పుతో మరింత ఆందోళన

వడ్లు తడిసి మొలకలు వస్తున్నయ్..

నా భర్త యాక్సిడెంట్‌లో చనిపోయిండు. నా ఇద్దరు కూతుళ్ల సాయంతో మూడు ఎకరాల్లో వరి పండించిన. వడ్లు తెచ్చి 15 రోజులవుతున్నది. ఇప్పటి వరకు కాంటా చేయలేదు. మొన్న పడ్డ వర్షానికి వడ్లు తడిసి మొలకలు వస్తున్నయ్. సొసైటీ వాళ్లు తెలిసిన వారికే తొందరగా కాంటా చేస్తున్నరు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

- జంగిటి పద్మ, మహిళా రైతు, బీబీపేట్

లారీల్తోస్తే 15 రోజుల్లో పూర్తిచేస్తాం

రైస్‌మిల్లుల్లో అన్‌లోడ్ చేయకపోవడంతోనే ఇబ్బందులొస్తున్నాయి. లారీలు వస్తే మా సొసైటీ పరిధిలో 15 రోజుల్లో కొనుగోళ్లు పూర్తిచేస్తాం. ఇప్పటి వరకు సొసైటీ పరిధిలో 2161 మంది రైతుల నుంచి 2,31,304 బస్తాలు (92,521. 60 క్వింటాళ్లు) ధాన్యం కాంటా వేసి రైస్‌మిల్లుకు తరలించాం. ఇం కా 1103(కుప్పలు),లక్షా 55వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉన్నది.

-నర్సాగౌడ్, సీఈవో, బీబీపేట్ సొసైటీ

మళ్లీ ఆరబెడుతున్నాం..

నేను నాలుగు ఎకరాల్లో వరి పండించిన. వడ్లను 18 రోజుల కిందట కేంద్రానికి తీసుకొచ్చిన. ఇక్కడి సొసైటీ సిబ్బంది నిర్లక్ష్యంతో కాంటా చేయక నిన్న, మొన్న పడ్డ వర్షానికి వడ్లన్ని తడిసి పోయాయి. దీంతో మళ్లీ ఆరబెడుతున్నాం. తడిసిన వడ్లకు మొలకలు వస్తున్నాయి. కాంటా తొందరగా పెట్టి.. బస్తాలను తరలిస్తే మాకు ఏ ఇబ్బందీ ఉండదు.

- సత్తవ్వ, మహిళారైతు, బీబీపేట్

కల్లాల్లో మొలకలు
రైతులకు కన్నీళ్లు

20 రోజులైనా కాంటా చేయని సొసైటీలు..



క్యాసంపల్లి కొనుగోలు కేంద్రంలో మొలకలు వచ్చిన ధాన్యం, తడిసిన ధాన్యం బస్తాలను ఆరబెట్టి రైతులు

బీబీపేట్‌లో లారీలు రాకపోవడంతో సెంటర్‌లో ఉన్న ధాన్యం బస్తాలు

ఐదు రోజుల్లో 95శాతం
కొనుగోళ్లు పూర్తిచేస్తాం

ధాన్యం తేమను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

రామారెడ్డి, మే 19: వచ్చే ఐదు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు 95శాతం పూర్తిచేస్తామని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. రామారెడ్డి మండలంలోని పోసానిపేట్, గిద్ద గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వడ్ల తేమను పరిశీలించి రైతులతో మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 350 కొనుగోలు కేంద్రాల ద్వారా 46,613 మంది రైతుల నుంచి రూ.576కోట్ల విలువచేసే 2.61లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని వెల్లడించారు. ఇప్పటి వరకు ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో రూ.504కోట్లు జమ చేసినట్లు వివరించారు. 200 కేంద్రాల్లో ధాన్యం పూర్తిగా కొనుగోలు చేశామ ని, మిగిలిన కేంద్రాల్లోనూ మొత్తం ధాన్యా న్ని కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు అధైర్యపడొద్దని, వర్షాలు పడినా తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌మిల్లులకు పంపిస్తామని పేర్కొన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున బాబు, తహసీల్దార్ తదితరులు ఉన్నారు.

ఖాతాలు ఇస్తే..
కటకటాల పాలే..

దుబాయ్‌లో ఇండియన్స్‌కు ఎర

- బ్యాంకు ఖాతాలకు కమీషన్ ఏజెంట్లు
- కమీషన్లకు కక్కుర్తి పడుతూ బ్యాంకు ఖాతాలు తెరిపిస్తున్న వైనం
- పదివేలకు ఆశపడి నిందితులుగా మారుతున్న ఖాతాదారులు

సిటీ బ్యూరో, మే 19 (నమస్తే తెలంగాణ): దుబాయ్‌లో వివిధ పనులు చేసే భారతీయులకు డబ్బు ఆశ చూపి వాళ్ల బంధువులు, తెలిసిన వారి పేర్లతో సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలను తెరిపిస్తున్నారు. ఈ బ్యాంకు ఖాతాలనే సైబర్‌నేరాలకు ఉపయోగిస్తున్నారు. కమీషన్లకు, ఐదో పదికో ఆశపడి బ్యాంకు ఖాతా తెరిచి ఇచ్చే అమాయక ప్రజలు ఇప్పుడు నేరస్తులుగా మారుతున్నారు. దుబాయ్ అడ్డగా నేడు చైనా సైబర్‌నేరగాళ్లు సైబర్‌నేరాలను చేయడంలో ఆరితేరిపోయారు. ఇందుకు ఎక్కడికక్కడ కమీషన్ ఏజెంట్లను నియమించుకుంటూ సైబర్‌దోపిడీ యథేచ్ఛగా చేస్తున్నారు. తాజాగా హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు ఐదుగురు బ్యాంకు ఖాతాదారులను అరెస్ట్ చేశారు. వీరంతా దుబాయ్‌లో సైబర్‌నేరగాళ్ల ట్రాప్‌లో పడ్డ వారి బంధువులు, చుట్టాలే కావడం గమనార్హం.

ఒకో ఖాతాకు రూ. 10వేలు..

ఉత్తర, ఈశాన్య భారతదేశంలో రూ. 10 వేలకు బ్యాంకు ఖాతాలు కొంటూ వేలాది మంది అమాయకుల వద్ద నుంచి సైబర్‌నేరగాళ్లు బ్యాంకు ఖాతాలు సేకరించి నేరాలకు పాల్పడ్డారు. అయితే నెమ్మదిగా దక్షణ భారత దేశంలోను సైబర్‌నేరగాళ్లు తమ నేరాలకు కావాల్సిన బ్యాంకు ఖాతాలను సమకూర్చుకుంటున్నారు. వాట్సాప్, టెలిగ్రామ్‌లలో ఏకంగా తమకు బ్యాంకు ఖాతాలు కావాలనే ప్రకటనలు ఇస్తూ కమీషన్ పద్ధతిలో ఈ ముఠా భారీగా మోసాలకు పాల్పడుతున్నది. ఇంతటితో ఆగకుండా ఇప్పుడు విదేశాలల్లో పనిచేసే భారతీయులను లక్ష్యంగా చేసుకుంటున్నది. సైబర్‌నేరగాళ్లు నేరుగా ఎక్కడ కూడా తమ వివరాలు వెల్లడించరు. మధ్యవర్తుల ద్వారానే అన్ని పనులు చేస్తుంటారు. దుబాయ్‌లో పనిచేసే వారితో మధ్యవర్తుల ద్వారా సంప్రదింపులు చేస్తుంటారు. ఒక్కో బ్యాంకు ఖాతాలకు అక్కడ మధ్యవర్తులు ఒక రేటు మాట్లాడుతారు. ఆ మధ్యవర్తులు వచ్చి అక్కడ పనిచేసే భారతీయులను సంప్రదిస్తారు. మీరు, మీ కుటుంబసభ్యులు, తెలిసిన వారి ద్వారా బ్యాం కు ఖాతా తెరిచి తమకు ఇస్తే ఒక్కో ఖాతాకు రూ. 15వేల నుంచి రూ. 20వేలు ఇస్తామంటూ ఒప్పందం చేసుకుంటున్నారు. దుబాయ్‌లో ఉండే వారు భారతదేశంలోని తమ స్వస్థలంలో ఉండే తమ వారికి రూ. 10వేలు ఇచ్చి బ్యాంకు ఖాతాలు తెరిపిస్తున్నారు. ఇలా 2009లో సౌదీకి వెళ్లి సివిల్ వర్క్ పనులు చేస్తున్న డబీర్‌పురాకు చెందిన అరీఫ్ సైఫికి బ్యాంకు ఖాతాలు తెరిపించే యూపీ, పంజాబ్‌కు చెందిన జైయిద్, సందీప్ సింగ్‌లు పరిచయం అయ్యారు. తమకు ఇండియాలో బ్యాంకు ఖాతాలు కావాలని క్రిప్టో కరెన్సీ బిజినెస్‌కు అవసరమని నమ్మించి ఒక్కో ఖాతాకు రూ. 15 వేలు ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. దీంతో సైఫీ, షార్జాలో ఉంటున్న చాదర్‌ఘాట్‌కు చెందిన ఫాతిమా బేగంతో మాట్లాడి ఈ విషయంపై చర్చించారు. ఆ తర్వాత ఇద్దరు తమ వారికి రూ. 10 వేలు ఇప్పించి పలువురి వద్ద నుంచి ఇండియాలో బ్యాంకు ఖాతాలు తెరిపించారు. ఆ వివరాలన్ని సైబర్‌నేరగాళ్లకు ఇచ్చారు. బ్యాంకు ఖాతాలు తెరిపించేందుకు సైబర్‌నేరగాళ్లు రెండు మూడు బృందాలుగా విడిపోయి ఎవరి స్థాయిలో వారు కమీషన్లు మాట్లాడుకుంటూ బ్యాంకు ఖాతాలు తెరిపిస్తున్నారు. ఎవరైనా బ్యాంకు ఖాతాలు తెరువాలని కోరితే అస్సలు నమ్మొద్దని పోలీసులు సూచిస్తున్నారు. తమ బ్యాంకు ఖాతా వివరాలు ఇతరులకు ఇవ్వొద్దని, అలా చేయడం కూడా నేరమని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

చిన్నారి ప్రాణాలు బలిగొన్న కూలర్

విద్యుదాఘాతంతో మృతి

కృతిక (ఫైల్ ఫొటో)

ఆర్మూర్‌టౌన్, మే 19: వేసవి సెలవుల్లో సరదాగా గడుపుదామని అమ్మమ్మ ఇంటికి వచ్చిన చిన్నారి కూలర్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయిన సంఘటన ఆర్మూర్ పట్టణంలో శనివారం రాత్రి చోటు చేసుకున్నది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గంగస్థాన్‌లో నివాసముండే వినీత్, దీపిక దంపతుల కుమార్తె కృతిక(6) విద్యుదాఘాతంతో మృతిచెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్‌లో నివాసముండే రేణుక.. నిజామాబాద్‌లో ఉంటున్న తన మనవరాలు కృతికను వేసవి సెలవులు ఉండడంతో గురువారం పెర్కిట్‌కు తీసుకువచ్చింది. శనివారం రాత్రి అమ్మమ్మ వంట పనుల్లో నిమగ్నమై ఉండగా కృతిక ఆడుకుంటూ కూలర్ వద్దకు వెళ్లింది.కూలర్‌ను తాకడంతో విద్యుత్‌షాక్‌కు గురై పడిపోయింది. వెంటనే సమీపంలోని ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలిక మృతి చెందినట్లు నిర్ధారించారు. అప్పటి వరకు కండ్ల ముందు ఆడుతూపాడుతూ తిరిగిన చిన్నారి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.